

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



### (గత సంచిక తరువాయి)

**పవిత్రకి నిద్రపట్టడం లేదు**. కళ్ళు మూసుకున్నా, తెరిచినా అదే రూపం...అదే స్వరం. మొదటిసారి అతను తన వైపు వేగంగా, ఉద్వేగంగా నడిచివచ్చిన సందు... ఆ కళ్ళల్లో కనిపించిన అంతులేని ఆశ... తడిసిన మందారంలా మారిన కళ్ళు ... ఆమె కనురెప్పల మీద నీడల్లా కదులుతున్నాయి.

భగవాన్! నీరసంగా వచ్చింది ఆమె నోటి నుంచి.

"నాన్న ఎన్నటికీ ఆయన్ని పిలిపించరు..." మధురిమ స్వరం పదే, పదే చెవుల్లో మారు మ్రోగుతోంది.

అంటే? అంటే? ఆయన మోహన్ కి ఫోన్ చేయలేదా? కలవడం లేదని అబద్ధం చెప్తున్నారా? తను చావు బతుకుల మధ్య ఉండి కోరిన కోరిక తీర్చరా? ఆయన మారలేదా? ఆమె మెదడు అనేక సందేహాలతో క్షణం, క్షణం బరువెక్కిపోతోంది. మెదడు మీద వంద కిలోల ఇనుప రాడ్ పెట్టినట్టు ఉంది.

అదే నిజమైతే ఎలా? ఎలా మోహన్ ని కలుసుకోడం? ఎలా అతనికి తను చేసిన ద్రోహానికి, చేసిన అవమానానికి పరిహారం లభిస్తుంది?

"మోహన్! నీ క్షమాభిక్ష పొందకుండా నేను ఈ జన్మ నుంచి విముక్తి పొందలేను." అనుకుంది మనసులో.

ఆమె కళ్ల నుంచి ధారాపాతంగా కారిపోతోంది కన్నీరు. ఆ కన్నీటి తెరల మధ్య నుంచి ఒక రూపం ఆమె కళ్ల ముందు ప్రత్యక్షం అయింది. ఒక స్వరం ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

"నా పేరు మోహన్... నా పేరు మోహన్..." గంభీరంగా, ఓ మేఘం ఉరిమినట్టు ... మెత్తటి మబ్బులు గుంపులు, గుంపులుగా భుజాల మీద జారినట్టు అనిపించింది.

ఈ భావాలన్నీ ఆరోజు అతను మాట్లాడినప్పుడు అనిపించలేదు... అహంకారం నెత్తి మీదనుంచి దిగాక, పూలపాన్పు అనుకున్న జీవితం ముళ్లతో నిండి తనువునీ, మనసునీ గాయాలు చేస్తుంటే , తన అందం తనని ఓ శత్రువులా చూస్తుంటే అప్పుడు, అప్పుడు దిగింది అహంకారం . అప్పుడు కలిగాయి ఈ భావాలన్నీ.

అహంకారం లేకుండా జీవించడం ఒక సంపద. అప్పుడా సంపద తన దగ్గర లేదు.

ఆమె కళ్ళనిండా నిండిన కన్నీరు రెండు పక్కలా చెవులని తడపసాగింది. మధు బరువెక్కిన రెప్పలు మూసుకుంది. ఆ రెప్పల మీద నీడలు... ఏవేవో రూపాలు, అదృశ్యాదృశ్య పరిసరాలు... కాసేపు సంపంగిపూల పరిమళం... మరి కాసేపు మల్లెల సుగంధాలు...

కాసేపు నిద్ర, కాసేపు మెలకువ... ఏవో రూపాలు, ఏవో జ్ఞాపకాలు... తరిమి తరిమి కొడుతున్నాయి.

దూరం నుంచి "అమ్మా!" అన్న మధురిమ స్వరం.

"మధూ! వచ్చావా? మోహన్ కి ఫోన్ చేసావా?"

"చేసాను. వస్తున్నారు... దారిలో ఉన్నారు."

"వస్తున్నాడా? దారిలో ఉన్నాడా? నిజంగానా? నేను రమ్మన్నానని చెప్పావా?"

"చెప్పాను. అందుకే వస్తున్నారు."

"ఇంకా రాలేదేం ఎప్పుడు బయలుదేరాడో. నువ్వు ఫోన్ చేయగానే రెక్కలు కట్టుకుని ఎగిరి ఉంటాడే?"

"వస్తారమ్మా. అందాకా నువ్వు విశ్రాంతి తీసుకో. పాపం చాలా దూరం నుంచి రావాలి కదా!" .

"నిజమే. చాలా దూరం...అందుకోలేనంత దూరం... ఎంత ప్రయత్నించినా చేరుకోలేనంత దూరం. గొణుక్కుంది ఆవిడ.

అవును చాలా దూరం. అంత దూరం నుంచి వస్తున్నాడు. వస్తాడు నాకు తెలుసు వస్తాడు. వస్తాడు...వస్తా..." కలవరిస్తూనే నెమ్మదిగా సుషుప్తిలోకి జారిపోయింది.

మధురిమకి అసహనంగా ఉంది... ఎవరీ మోహన్? అతనెవరో తెలుసుకునేదాకా మనశ్శాంతి లేదు.

మోహన్ ... మోహన్ ఎవరీ మోహన్? ఎక్కడ ఉంటాడు? ఆయనని ఎలా కాంటాక్ట్ చేయాలి. ఆయన ఫోన్ నెంబర్, చిరునామా ఏమి తెలియదే. ఎలా పిలిపించాలి?

నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్లి మంచం మీద వాలి భర్తకు ఫోన్ చేసింది.

"సిద్ధూ! అమ్మకి బాలేదు. నేను రెండు రోజులు ఇక్కడే ఉంటాను. పిల్లలు జాగ్రత్త."

"ఎక్కడున్నారు? హాస్పిటల్ లోనా?"

"లేదు ఇంట్లోనే ఉంది. కానీ, ఏదో మాట్లాడుతోంది సంధి ప్రేలాపన అంటామే. నాకు భయంగా ఉంది."

"డోంట్ వర్రీ. ఏమి కాదు. పిల్లల గురించి టెన్షన్ పడకు. నేను చూసుకుంటా. నువ్వు మీ అమ్మగారిని చూసుకో."

"థాంక్స్ సిద్ధూ !"

ఫోన్ డిస్ కనెక్ట్ చేసి, వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. అమ్మది సంధి ప్రేలాపనేనా? ఎట్టి పరిస్థితుల్లో రేపు మోహన్ కథ తెలుసుకోవాలి. అందాకా ఇక్కడి నుంచి వెళ్ళేది లేదు. నిశ్చయంగా అనుకుంది.

చాలాసేపు ఆమె ఆలోచనలు మోహన్ అనబడే ఒక అజ్ఞాతవ్యక్తి చుట్టూ పరిభ్రమించాయి. మోహన్ అమ్మకి ఏమవుతాడు? సమాధానం కోసం అన్వేషిస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకుంది.

ఆమెకి మెలకువ వచ్చేసరికి బాగా తెల్లవారిపోయింది.

అయ్యో అమ్మకి సేవలు చేయడానికి ఇక్కడ ఉండి ఇదేంటి ఇంతసేపు నిద్రపోయాను... అనుకుంటూ లేచి తల్లి గదిలోకి వెళ్ళింది. సిస్టర్ వచ్చి పవిత్రకి స్పాంజ్ బాత్ చేయించి, చీర మార్చినట్టుంది. ఆవిడ మొహం తేటగా ఉంది. మధురిమ ఊపిరి పీల్చుకుంది.

"రండి డాక్టర్" తండ్రి స్వరంతో పాటు, డాక్టర్ లోపలికి వచ్చారు.

"ఏమ్మా ఎలా ఉన్నారు?" డాక్టర్ పవిత్రని పరీక్షిస్తూ అడిగాడు.

ఆవిడ మందహాసం చేసింది.

"అక్కినేని నాగేశ్వరరావు గారి సినిమా ఇద్దరు మిత్రులు ఉంది youtube లో చూసారా?" అడిగాడు డాక్టర్. ఆయన కూడా అక్కినేని అభిమాని. పవిత్ర ఒకప్పుడు అక్కినేనికి వీరాభిమాని అని తెలుసు. పదిహేనేళ్ళుగా ఆ కుటుంబంతో అనుబంధం ఉంది. శివరామకృష్ణకి ప్రొఫెసర్ ఆయన ఒకప్పుడు. ఎనభై ఏళ్ళు ఉన్నా, ఇంకా ప్రాక్టీసు చేస్తున్నాడు.

మధురిమవైపు చూసి, "ఏమ్మా ! ఆఫీస్ కి లీవు పెట్టావా?" అడిగాడు.

"అవునండి. ఇవాళ, రేపు అమ్మదగ్గర ఉందామని. నాన్న ఒక్కరే చూసుకుంటున్నారు"అంది మధురిమ.

"గుడ్" ఆమె భుజం తట్టి నెమ్మదిగా ఆమెకి మాత్రమే వినిపించేలా అన్నాడు " వీలున్నంత ఎక్కువసేపు ఆవిడతో మాట్లాడుతూ గడపండి. మానసికంగా బాగా ఆందోళనగా ఉన్నట్టుంది".

మధురిమ చివుక్కున తండ్రివైపు చూసింది. ఆయన పవిత్ర ఒంటి మీద దుప్పటి సవరిస్తున్నాడు.

మధురిమ తల ఊపింది. డాక్టర్, శివరామకృష్ణ దగ్గర కూడా సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

మధురిమ "నాన్నా! టిఫిన్ తిన్నావా?" అని అడిగింది.

"లేదు నువ్వు కూడా స్నానం చేసిరా తిందాం " అన్నాడు ఆయన.

"అమ్మ ఏం తింది?"

"ఇడ్లీ "

"ఓ ... ఓకే నేను స్నానం చేసి వస్తాను" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

తల్లితో మాట్లాడాలి అంటే, తండ్రిని బయటకు పంపించాలి. ఎలా? ఎక్కడికి పంపించాలి?

ఆయన ప్రాక్టీసు మానేసి కూడా రెండేళ్ళు అయింది. రెండేళ్ళ క్రితం హార్ట్ ఎటాక్ వచ్చి వారం రోజులు హాస్పిటల్ లో ఉన్నాడు. ఆ తరవాత ప్రాక్టీసు మానేసాడు. "ఏం.బి.బి.ఎస్ డాక్టర్స్ తో ఇప్పుడు పెద్ద అవసరం లేదమ్మా... అందరూ సూపర్ స్పెషాలిటీ చేసిన వాళ్ళే ఉన్నారు" అన్నాడు క్లినిక్ మూసేసినప్పుడు మధురిమ అడిగితే.

అప్పటి నుంచీ ఇంట్లోనే ఉంటున్నాడు. అవసరం అయితే తప్ప వెళ్ళడు. బయటకు వెళ్తే ఖర్చులు అవుతాయి అంటాడు. కానీ ప్రతిరోజూ రాత్రి ముగ్గురు స్నేహితులతో చతుర్ముఖ పారాయణం, తాగుడు ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది.

ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు, సాయంత్రం ఆరు నుంచీ ఎనిమిన్నర వరకు మాత్రమే క్లినిక్ లో ఉంటాడు. ఎనిమిదిన్నరకి ఆయనతో పాటు మరో ఇద్దరు స్నేహితులు వస్తారు. ముగ్గురూ కలిసి తొమ్మిదింటికి మొదలు పెడితే పన్నెండు గంటలదాకా తాగుతూ, పేకాట ఆడుతూ, కబుర్లు చెప్పుకుంటూ గడిపి, అర్ధరాత్రి వాళ్ళిద్దరినీ పంపించి, ఇంక డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటే, ఆయన వాగే వాగుడు భరిస్తూ, ఎంతసేపు తింటే అంతసేపు పవిత్ర కూడా కూర్చోడం అలవాటు అయిపోయింది.

కాకపోతే పవిత్ర పడిపోయి, హాస్పిటల్ లో ఉండి వచ్చిన దగ్గర నుంచీ ఆయనలో చిత్రమైన మార్పు వచ్చింది. తాగడంలేదు, ఫ్రెండ్స్ కూడా రావడంలేదు.

మధురిమకి ఇప్పుడు ఆయన్ని బయటకి ఎలా పంపించాలో అర్థం కాలేదు. ఆలోచిస్తూనే పనులన్నీ చేసుకుంది. మధ్యాహ్నం లంచ్ టైం లో అంది. "నాన్నా! చాలా రోజులైంది కదా. నీకు ఏదన్నా పని ఉంటే చేసుకో. ఈ రెండు రోజులు నేనుంటాను అమ్మ దగ్గర. మళ్ళీ నేను వెళ్ళాక నువ్వే చూసుకోవాలిగా".

ఆయన కూతురివైపు చూసాడు. కొన్ని క్షణాలు ఆలోచించి " వెళ్ళనా? " అన్నాడు.

"వెళ్ళు నాన్నా. అమ్మ బానే ఉంది కదా. నేను చూసుకుంటాలే" ఉత్సాహం కన్పించకుండా అంది.

"సరే! భోజనాలు అయ్యాక, కాసేపు పడుకుని లేచి నాలుగింటికి వెళ్తాను. రాత్రి పది అవుతుంది వచ్చేసరికి పర్లేదా?"

"ఏం పర్లేదు నాన్నా." అంది.

అన్నట్టుగానే ఆయన నాలుగింటికి డ్రెస్ అయి బయటకు వెళ్ళిపోయాడు.

అందుకోసమే ఎదురుచూస్తున్న మధురిమ, పనిమనిషిని కూడా పంపించేసి, తలుపు గడియవేసి తల్లి గదిలోకి వెళ్ళింది.

“ఆవిడ కళ్ళు తెరుచుకుని సీలింగ్ కేసి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది. మధురిమ ఆవిడ దగ్గరగా వెళ్లి మృదువుగా పిలిచింది. “అమ్మా”.

ఆవిడ మధురిమ వైపు చూసింది.

“కాఫీ గానీ, పాలుగానీ తాగుతావా?”

“వద్దు నాన్న బయటకి వెళ్ళారా?” అడిగింది పవిత్ర.

తల ఊపింది మధురిమ.

ఆవిడ కళ్ళు మూసుకుంది.

“అమ్మా... నీ గురించి చెప్తావా?”

ఆవిడ కూతురువైపు చూసి పల్చగా నవ్వింది. “వింటావా?”

“తప్పకుండా. చెప్పు.”

పవిత్ర కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా ఉండి “చెప్పసాగింది. నీకు తాతగారి గురించి, అమ్మమ్మ గురించి ఏమి తెలియదు కదూ... దురదృష్టవశాత్తూ నీకు మూడేళ్ళ వయసులో అమ్మా, నాన్న, నానమ్మా తిరుపతి వెళ్లి వస్తూ యాక్సిడెంట్ లో పోయారు. “

“అవును నేను చాలా బాడ్ లక్ “ అంది మధురిమ.

పవిత్ర నిట్టూర్చింది. ఆవిడ స్వరం నెమ్మదిగా ఆ నిశ్శబ్దంలో పియానో వాయిద్యంలా మోగింది.

మాతాతగారిది గుడివాడ పరిసరప్రాంతమైన బేతవోలు . .. అక్కడి ఆనందీశ్వరస్వామివారి ఆలయంలో మా తాతగారు పూజారి. ఆయనపేరు కోట పద్మనాభశర్మ. ఆలయ ప్రాంగణంలోనే, ఆ ఊరి సర్పంచి తాతగారికి ఒక పెంకుటిల్లు ఇచ్చారు. ఆయనకి ఇద్దరు కొడుకులు. పెద్దవాడి పేరు రామశర్మ , రెండో అబ్బాయి పేరు మాధవశర్మ ... వాళ్లకి ఆడపిల్లలు లేరు. ఆడపిల్లలంటే తాతగారికి, నాన్నమ్మకి ఎంతో ఇష్టం. కారణం మూడు తరాలుగా ఆ వంశంలో ఆడపిల్లలు లేరు. తాతగారికి ఊళ్ళో ఎంతో మంచి పేరు ఉండేది. కానీ, ఆదాయం పెద్దగా లేదు.

ఆయనకి చదువంటే ఇష్టం. తన కొడుకులను బాగా చదివించాలని ఆయన ఆశయం. ఆ ఆశయానికి తగినట్టే కొడుకులిద్దరూ ఇంజనీర్ లు అయ్యారు. అయితే, రామశర్మకి అనుకోకుండా విదేశాల్లో ఉద్యోగం చేసే అవకాశం వచ్చింది. తల్లి,తండ్రులు ఎంతో సంతోషించారు. కారణం అప్పటికే ఆ ఊళ్ళో కామందుల పిల్లలు చాలా మంది విదేశాలకు వెళ్ళడం, ఆ విషయం అందరూ కథలు, కథలుగా చెప్పుకోడం వల్ల తన కొడుకు విదేశాలకు వెళ్ళాలని ఆయన ఆశపడ్డాడు. ఆశ తీరడం ఆనందమే కలిగించింది. వెళ్ళే ముందే, అన్ని విధాల అనుకూలవతి, స్కూల్ ఫైనల్ పాస్ అయిన విద్యావతితో వివాహం జరిపించి, ఇద్దరినీ దగ్గర ఉండి మరీ పంపించారు.

రెండో అబ్బాయి మాధవశర్మ  సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసాడు. విజయవాడలో చదువుకోడం వల్ల అతనికి ఆధునికంగా బతకడం అలవాటు అయింది. అంతే కాక, అక్కడ చూసిన కొన్ని కొత్త, కొత్త రకాల ఇళ్ళు అతనికి ఎంతో నచ్చాయి. అలా తను కూడా మంచి బిల్డర్ అవాలని అతని కోరిక. తండ్రితో తన మనసులో మాట చెప్పి, ముందుగా తాము ఉంటున్న  ఆ పెంకుటిల్లు  పడగొట్టించి మంచి ఇల్లు కట్టుకుందాం అన్నాడు తండ్రితో. ఆ ఇల్లు ఉండడానికే కానీ, ఆ ఇంటిమీద తమకి హక్కులేం  లేవని చెప్పాడు ఆయన.

అయితే,  తను పుట్టి పెరిగిన ఊరంటే ఎంతో ఇష్టం మాధవ శర్మకి.   ఆ ఊరే అభివృద్ధి చేయచ్చు కదా అని ఆలోచించి,  విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ లాంటి నగరాలు తిరిగి, కొత్త, కొత్త మోడల్స్ లో కట్టిన భవనాలు పరిశీలించి ఎన్నో ఆధునిక పద్ధతులు నేర్చుకుని వచ్చాడు.  అప్పటికే సర్పంచ్ కొడుకులు కూడా అమెరికా వెళ్ళడం కాక, అక్కడే స్థిరపడ్డారు. అందుకే  సర్పంచ్ తో మాట్లాడి, వాళ్ళ ఇల్లు ఆధునీకరిస్తానని చెప్పి, ఆయనని ఒప్పించి, ఒక అందమైన రెండంతస్తుల మేడ మొదటిసారిగా ఆ ఊళ్ళో  కట్టాడు.

గుడివాడ లో ఉమెన్స్ కాలేజీలో లెక్చరర్ గా పని చేస్తున్న ప్రభాకర్,  పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన తన ఇల్లు కూడా ఆధునికంగా కట్టడానికి మాధవశర్మని అడగడం అతను అంగీకరించి, ఎంతో అందమైన డాబా ఇల్లు కట్టించి, అందరి అభిమానం పొందాడు. ఆ విధంగా ఆయన ఒక బిల్డర్ గా మారాడు.

అతని ప్రతిభ, కష్టపడే తత్త్వం చూసిన గుడివాడ వాస్తవ్యుడు, రమణాచారి తన కూతురు వర్ధనిని మాధవశర్మ కి చేసుకోవాల్సిందిగా పద్మనాభ శర్మని ని కలిసాడు. ఆ విధంగా వర్దని తో వివాహం అయిన తరువాత, ఆమెకి తండ్రి పెళ్లి కానుకగా ఇచ్చిన మూడు వందల గజాల స్థలంలో ఒక అందమైన ఇల్లు కట్టి అక్కడికి మకాం మార్చాడు మాధవశర్మ .

ఇది మా నాన్నగారి పూర్వ కథ.

మా పెదనాన్నగారికి కూడా వంశపారంపర్యంగా ఇద్దరు కొడుకులే పుట్టారు. కానీ మా నాన్నకి మాత్రం నేను పుట్టాను.

నా పేరు పవిత్ర అని పెట్టుకున్నారు.  నా తరవాత మరో ఆడపిల్ల పుట్టి ఏడాది లోనే చనిపోయింది. అందుకే నేనంటే అందరికీ అపురూపం. పైగా నేను పుట్టాక మా నాన్నకి బాగా కలిసొచ్చిందిట.  పవిత్రా బిల్డర్స్ అనే పేరు బాగా ప్రాచుర్యం పొందింది.  గుడివాడేకాక విజయవాడ, గుంటూరు, ఒంగోలు ఇలా ఎన్నో చోట్ల నాన్న కి మంచి బిల్డర్ గా పేరొచ్చింది. ఎప్పటికప్పుడు కొత్త, కొత్త మార్పులతో , కొత్త , కొత్త భవనాలు కట్టడం మొదలుపెట్టాడు.

మా ఇల్లు గుడివాడలో ఎంతో ప్రముఖంగా ఉండేది. సత్యనారాయణపురంలో మాధవశర్మ ఇల్లు గురించి ప్రత్యేకంగా చెప్పుకునే వాళ్ళు. మండువా లోగిలి, విశాలమైన హాలు, మూడు పడకగదులు, అందమైన వంటగది, దాన్ని ఆనుకుని విశాలంగా భోజనాల హాలు, పూజ గది, వంటగది వెనకవైపు ఒక దీర్ఘ చతురస్రాకారపు నడవా,  రెండు స్నానాల

గదులు, రెండు లావేటరీలు ... పెద్ద పెరడు, అందమైన తోట, హాలులోంచి పైకి వెళ్ళడానికి మెట్లు, పైన ఒక పెద్ద వరండా, ఒక పడకగది. ఎంతో బాగుండేది. నాన్న ఇష్టంగా కట్టుకున్న ఇల్లు.

మా ఇంటికి ఎదురుగా ఒక మేడ, మాత్రమే ఉండేది. మిగతావన్నీ ఎడం ఎడంగా పెంకుటిళ్ళు.

మా గుడివాడకి పెద్ద చరిత్ర ఉంది. నాన్న నాకు ఆ చరిత్ర, కథలు, కథలుగా చెబుతుండేవారు. కళింగరాజు పరిపాలనలో గుడివాడ ఆంధ్రనగరం పేరుతొ ప్రసిద్ధి పొందింది. క్రీస్తు పూర్వం రెండు వందల డబ్బై మూడు నాటికి అశోకుడు పరిపాలించే కాలంలో ఆంధ్రనగరాలు ముప్పై ఉన్నాయి. కృష్ణాతీరంలో ఎన్నో బౌద్ధ కేంద్రాలు ప్రసిద్ధి చెందాయి. వాటిలో అమరావతి, భట్టిప్రోలు, నాగార్జున కొండ, జగ్గయ్యపేట, బోడపాడు, చందోలుతో పాటు గుడివాడ కూడా బౌద్ధ క్షేత్రం. గుడివాడ చుట్టూ ఎన్నో గుళ్ళు ఉన్నాయి. అందుకే దీన్ని పూర్వం గుడులువాడ అనేవారు. అది కాలక్రమేణా గుడివాడగా మారింది. అక్కడ వెంకటేశ్వరస్వామి ఆలయం, వినాయకుడి గుడి, నాగమ్మ తల్లి దేవాలయం, ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం ఇలా చాలా దేవాలయాలు ఉన్నాయి. చెప్పాగా అందుకే ఆ ఊరిని గుడులవాడ అనేవారు.

శరత్ టాకీసు, గౌరీశంకర్ టాకీస్, వెంకటేశ్వర థియేటర్ ఈ సినిమా హాల్స్ లో మంచి, మంచి సినిమాలు వస్తుండేవి.

తాతగారు నాకు ఎనిమిదేళ్ళ వయసులో చనిపోయారు. నాన్నమ్మ మా దగ్గరకు వచ్చేసింది. నాన్నమ్మకి నేనంటే పంచప్రాణాలు. అమ్మకన్నా నాకు నానమ్మే బాగా దగ్గర అయింది. అమ్మ ఎప్పుడూ ఇంటికి వచ్చీ, పోయే నాన్న స్నేహితులకి, బంధువులకి వంట చేసి పెడుతూ, పూజలు చేస్తూ ఉండేది.

నానమ్మ ఆ రోజుల్లోనే చాలా ఫార్వర్డ్. స్నానం చేసి, పూజ గదిలో కాసేపు కూర్చుని నాలుగు శ్లోకాలు చదువుకుని బయటకు వస్తే, మళ్ళీ రేపు ఉదయం వరకు అటు వెళ్ళేది కాదు. ఆవిడ ప్రతి వార్తా పత్రికా చదివేది ఇంగ్లీష్ పేపర్ తో సహా. ఇంటికి వచ్చిన ప్రతి వాళ్ళతో చక్కగా దేశ రాజకీయాలు మాట్లాడుతూ ఉండేది. నాకు కలెక్టర్ మొగుడు కావాలి అనుకున్నానే, గుళ్ళో పూజారినిచ్చాడు దేవుడు అనేది నవ్వుతూ.

మూడు సినిమా టాకీస్ లలో విడుదల అయిన ప్రతి సినిమా చూసేది. నేనూ ఆవిడతో కలిసి ప్రతి సినిమాకి వెళ్ళేదాన్ని. నాన్నే మందలించేవాడు . " నువ్వు వెడితే వెళ్ళు, దానికి సినిమా పిచ్చి అంటగట్టకమ్మా... దాన్ని కలెక్టర్ చేసి, నీ కోరిక తీర్చుకోవచ్చుగా" అంటూ.

"సినిమా చూస్తే చదువుకోదా ఏంటి? అయినా అస్తమానం పుస్తకాల పురుగులా ఉండాలా... బళ్ళో చెప్పేవి చాలు దాని బుర్రలో పదిలంగా ఉంటాయి " అనేది నన్ను వెనకేసికొస్తూ.

నానమ్మ కి అక్కినేని నాగేశ్వరరావు, ఎన్ టి రామారావు, సావిత్రి, జమున అంటే విపరీతమైన ఇష్టం. రేడియో ఘంటశాల పాటల కోసం నిత్యం మోగుతూనే ఉండేది.

"ఆ మహానుభావులు నడయాడిన ఊరే మన గుడివాడ... ఎంత గొప్ప ఊరనుకున్నా. ఈ కాలేజ్ అక్కినేని గారు కట్టించారు. నువ్వు ఇదే కాలేజ్ లో చదువుకోవాలి" అనేది ANR కాలేజీ ముందు నుంచి నడుస్తున్నప్పుడు. " అంతేకాదు కైకాల సత్యనారాయణగారు, ఘంటశాలవారు కూడా ఇక్కడే చదువుకున్నారు" అని కలిపేది.

ఓసారి నానమ్మ కాలికి పెద్ద రాయి తగిలి పెద్ద గాయం అయింది.

నాన్న "ఎందుకమ్మా నడిచి వెళ్తారు ఊళ్లోకి కారు కొన్నా కదా" అని విసుక్కున్నాడు.

" చాల్లేరా... ఆ మహానుభావులు నడిచిన నేల. ఎంత పవిత్రమైన నేల ఇది... ఇక్కడ నడిచి వెళ్ళడమే మేలు" అనేది.

అలా నానమ్మ దగ్గర, నానమ్మ అభిరుచులు, అలవాట్లు పెనవేసుకుంటూ , నానమ్మ కూచిగా పెరిగాను. కాలం గడిచిపోతూ ఉంది. నేను గౌనుల నుంచి పరికిణీ, ఓణీ లకు వచ్చాను.

పదో తరగతి పాస్ అయ్యాను.

నాన్న ఉమెన్స్ కాలేజీ లో చేర్పిస్తా అంటే, నాన్నమ్మ ఒప్పుకోలేదు, "మన అక్కినేని గారి కాలేజీ ఉండగా అక్కడెందుకురా" అంది.

"అక్కడ మగపిల్లలు కూడా చదువుకుంటారు అత్తయ్యా. బాగుండదేమో" అని అమ్మ అంటే, "ఎవరికే బాగుండనిది. దివ్యంగా ఉంటుంది. ఇంకా ఈ రోజుల్లో, ఆడ, మగా తేడాలేంటి? నీ తోడికోడలు అక్కడ పాంట్ లు వేసుకుంటోంది" అంది పెద్దమ్మని ఉద్దేశించి.

మొత్తానికి నానమ్మ ప్రమేయంతో అక్కినేని గారి కాలేజీ లో ఇంటర్ లో చేరాను. బారెడు జడ, చారెడు కళ్ళు, పచ్చని ఒంటిరంగు. నానమ్మ ఎవరికీ తెలియకుండా రోజూ నా అరికాళ్ళలో రూపాయి కాసంత కాటుక పెట్టేది. నా తల్లి జమునలా ఉంటుంది అనేది.

పవిత్ర చెప్పడం ఆపింది. ఊపిరి బిగపట్టి ఆవిడ చెబుతున్న కథ వింటున్న మధురిమ ఆవిడ ఆపడంతో ఆదుర్దాగా అడిగింది."అలసిపోయావా అమ్మా! కాఫీ ఇవ్వనా?"

"హార్లిక్స్ ఇవ్వు " అంది పవిత్ర.

మధురిమ వంట గదిలోకి వెళ్ళింది. ఇంకా మోహన్ అనే పాత్ర ప్రవేశించలేదు అమ్మ కథలో. ఎప్పుడు వస్తాడు? అమ్మకి ఏమవుతాడు? ఆలోచిస్తూనే హార్లిక్స్ కలిపి తీసుకు వచ్చింది.

పవిత్ర కొద్దిగా లేచి దిండుకానుకుని కూర్చుంది. ఆవిడ హార్లిక్స్ తాగుతున్నంతసేపు అలా చూస్తూ కూర్చుంది మధురిమ. ఆమెకి తల్లి చెబుతున్న కథ అప్పటికప్పుడు పూర్తిగా వినాలని ఉంది.

ఆవిడ తాగడం పూర్తి చేసి గ్లాసు మధురిమకి ఇచ్చింది.

"నాన్న ఎక్కడికి వెళ్ళారు?" అనడిగింది.

"చెప్పలేదమ్మ బహుశా ఫ్రెండ్ ఇంటికి వెళ్లి ఉంటారు. పది గంటలదాకా రారు"

"ఓ " ఆవిడ అలాగే కూర్చుని చెప్పడం మొదలుపెట్టింది.

"ఇప్పటిదాకా నా కుటుంబం కథ విన్నావు మధూ! ఇంక నా కథలోకి వస్తాను.

అప్పటివరకు నాకు నానమ్మే ఫ్రెండ్, ఫిలాసఫర్... కానీ కాలేజ్ లో చేరాక నాతోపాటు చేరిన సత్యతో, శ్రీదేవితో నాకు మంచి స్నేహం కుదిరింది. నేను లెక్కలు తీసుకుంటే, వాళ్ళు ఫిజిక్స్ తీసుకున్నారు. మా కాలేజి చాలా విశాలంగా, పెద్ద, పెద్ద చెట్లు, పొడుగాటి కారిడార్స్, పెద్ద, పెద్ద క్లాస్ రూములు, చక్కటి లాబ్, ఇరవై ఐదు ఎకరాల స్థలంలో కట్టిన విద్యాలయం.

లోపలికి వెళ్ళగానే నా అభిమాన కథానాయకుడు అక్కినేని గారి నిలువెత్తు తైలవర్ణ చిత్రం నన్ను ఎంతో ఆకట్టుకుంది. మా ప్రిన్సిపాల్ గారి రూమ్ ఎదురుగా పెద్ద సంపెంగ చెట్టు ఉండేది. అటువైపు వెళ్ళగానే గుప్పున వచ్చేది పరిమళం. ఎవరూ చూడకుండా మేము ముగ్గురం పూలు తెంపి బాగ్ లో వేసుకునేవాళ్ళం.

మావిడి చెట్టు కూడా ఉండేది. ధారాళంగా గాలి వీస్తుంటే, మా పైట చెంగులు గాలిలో ఎగురుతుంటే, మాకు మేమే సినిమా హీరోయిన్స్ అనుకునేవాళ్ళం. వాళ్ళిద్దరూ 'నీకేమ్మా అందగత్తెవి. సినిమాల్లోకి వెళ్ళినా వెళ్తావు' అనేవాళ్ళు వాళ్ళిద్దరూ. 'నేను వెళ్తే మిమ్మల్ని కూడా తీసుకుని వెళ్తా లెండె' అనేదాన్ని.

మేము ముగ్గురం చేరితే చేసే అల్లరి అంతా, ఇంతా కాదు, వాళ్ళిద్దరూ మా ఇంటికి దగ్గరలోనే ఉండేవాళ్ళు. కానీ వాళ్ళవి పెంకుటిళ్ళు.

మీ ఇల్లు ఎంత బాగుంటుందో అనేవాళ్ళు.

'మా నాన్న చేత కట్టించుకోండి. మా ఇల్లులా కడతాడు' అనేదాన్ని.

వాళ్ళు ఏమి అనేవాళ్ళు కాదు. ముగ్గురం కలిసి వెళ్ళడం, కలిసి ఇంటికి రావడం. మధ్యలో సినిమా కబుర్లు... కాలేజ్ లో చేరాక కూడా నేను నాన్నమ్మతో సినిమాలకి వెళ్ళడం మానలేదు.

అలా కొత్త సినిమా చూసిన వెంటనే ఆ కథంతా వాళ్ళిద్దరికీ చెప్పేదాన్ని. అందులో పాటలన్నీ కంఠతా పట్టేసి పాడేసేదాన్ని.

ఆరోజు శనివారం. శరత్ టాకీసులో మంగమ్మ శపథం సినిమా విడుదల అయిందని, నాన్నమ్మ, నేను వెళ్లాం. సినిమా చూసి ఇంటికి వచ్చేసరికి తొమ్మిది అయింది. నేనా సినిమాలో ప్రతి సన్నివేశం, ప్రతి పాట, జమున అందం గురించి అమ్మకి, ఊరించి, ఊరించి చెబుతూ చాలాసేపు మేలుకున్నాను. అమ్మ ఇంక చాలు పడుకో మళ్ళీ త్వరగా లేవమంటే లేవవు అని కోప్పడ్డంతో పన్నెండు అవుతుండగా పడుకున్నాను.

తెల్లారి పొద్దుపోయాక లేచాను. నేను నిద్రలేచేసరికి గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న పసుపు పచ్చ మేడలో సందడి వినిపించింది. రెండు ట్రక్కుల్లో సామాను, కొత్త మనుషులు ... ఆశ్చర్యంగా చూసి నానమ్మ దగ్గరకి వెళ్లి అడిగాను.

“నానమ్మా ఆ ఇంట్లో ఎవరో వచ్చారు ఎవరు?”

“ఏమో! మీ నాన్న పిలిపించాడుట. కొత్త బిల్డింగ్ లకి ఆయన నమూనాలు వేస్తాట్ట.. “ అని చెప్పింది.

“అంటే?” ఆశ్చర్యంగా అడిగాను.

నాకూ తెలియదు. మీ నాన్న వ్యాపారంలో ఆయనా పెట్టుబడి పెట్టాట్ట. మీ నాన్ననే అడిగి తెలుసుకో మిగతా విషయాలు” అంది.

నమూనా అంటే అప్పుడు తెలియలేదు. నాన్నని అడిగాను. ఆయనని ఆర్కిటెక్ట్ అంటారు అని చెప్పాడు. మంచి, మంచి భవనాలకు డిజైన్ గీస్తాడు అని కూడా చెప్పారు నాన్న.

నాకు పెద్దగా తెలియని ఆ విషయం గురించి రెట్టించలేదు.

మామూలుగానే కాలేజ్ కి వెళ్తున్నాను. అప్పుడప్పుడు పసుపు మేడవైపు చూస్తే, డాబా పిట్ట గోడ మీద కుండీల్లో మొక్కలు కనిపించాయి. పెద్దగా పట్టించుకోలేదు నేను.

పదిరోజుల తరవాత ఒకరోజు నేను కాలేజ్ కి బయలుదేరి వీధి మలుపు తిరిగేసరికి అక్కడ ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. నన్ను చూడగానే గబ,గబా నడుచుకుంటూ నా దగ్గరకి వచ్చాడు. అతను నల్లగా ఉన్నాడు. ఐదడుగుల ఆరంగుళాలు ఉంటాడేమో! సన్నగా ఉన్నాడు. నాకు ఒళ్ళు జలదరించింది అతన్ని చూడగానే. నా అడుగుల్లో వేగం పెంచుతూ ఉండగా అన్నాడు.

“నీ పేరు పవిత్ర కదూ...!? నా పేరు మోహన్. కృష్ణ మోహన్. నువ్వు చదువుతున్న కాలేజ్ లోనే చదువుతున్నాను. నేను డిగ్రీ చేస్తున్నాను.” అన్నాడు.

“అయితే, నాకెందుకు చెప్తున్నావు?” కోపంగా అడిగాను.

ఎంతో అందగత్తెని అయిన నాతొ అంత వికారంగా ఉన్న ఆ యువకుడు మాట్లాడడం నాకు నచ్చలేదు.

“నాకు నువ్వంటే ఇష్టం. అందుకే స్నేహం చేసుకుందామని. మీ ఇంటి ఎదురుగా పసుపుపచ్చ మేడలో ఉంటాం మేము.”

జుగుప్సగా చూసాను. అక్కడ ఉంటారా? ఛీ “ అని చీత్కరించుకుని పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాను.

“పవిత్రా! నా మాట విను “ అని వినిపిస్తున్న అతని స్వరం వినిపించనంత దూరం పరిగెత్తి అలసిపోయి ఆగిపోయాను. నేను ఆగిన స్థలం శ్రీదేవి ఇంటికి దగ్గర. అప్పటికే నా కోసం ఎదురు చూస్తోంది.

“అదేంటి ఎందుకు ఆయాసపడుతున్నావు?” అనడిగింది.

“పరిగెత్తుకుని వచ్చాను. ఒక ఎలుగుబంటి కనిపించింది” అన్నాను.

“అమ్మో ఎలుగుబంటే?” భయంగా చూసింది.

“అవును. పద, పద త్వరగా వెళదాం”తన చేయి పట్టుకుని ముందుకు నడుస్తూ ఉండగా మళ్ళీ వినిపించింది అతని స్వరం “పవిత్రా!” అంటూ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS